క్లుప్తంగా

పాణ్యం సీఐగా నల్లప్ప



ఎస్పీ రఘువీర్‌రెడ్డిని కలసిన సీఐ నల్లప్ప

పాణ్యం : పాణ్యం సీఐగా సి.నల్లప్ప ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లాలో ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు సీఐగా పదోన్నతి కల్పించడంతో నంద్యాలకు వచ్చారు. నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆయన్ను బదిలీపై పాణ్యం సర్కిల్‌కు పంపారు. ఈ మేరకు ఆదివారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌ఐ అశోక్ సిబ్బంది కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన నంద్యాలలో ఎస్పీ రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్ ఫిజియోథెరపీ చేస్తారన్నారు. దివ్యాంగులను భవిత కేంద్రానికి తీసుకవచ్చి ఫిజియోథెరపీ చేయించాలని సూచించారు.

బైన్‌దొడ్డిలో అగ్నిప్రమాదం



చెట్లకు మంటలను ఆర్పేస్తున్న కోడుమూరు అగ్నిమాపక సిబ్బంది

కోడుమూరు రూరల్ : మండలంలోని బైన్‌దొడ్డి గ్రామంలో పొలాల పక్కనున్న కంపచెట్లకు అంటుకున్న నిప్పు ప్రమాదవశాత్తు మొక్కజొన్న పొలానికి వ్యాపించింది. విషయం తెలుసుకున్న కోడుమూరు అగ్నిమాపక సిబ్బంది సకాలంలో బైన్‌దొడ్డి గ్రామానికి చేరుకుని మొక్కజొన్న పొలానికి అంటుకున్న మంటలను ఆర్పేశారు. పొలాన్ని కాపడడంతో పాటు, కంపచెట్లకు అంటుకున్న మంటలను కూడా ఆర్పేసి ప్రమాదం పెద్దది కాకుండా కట్టడి చేశారు.

12న బహిరంగ వేలం పాట

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 12న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో టెంకాయలు, పూలు, పటముల ఆంగళ్లు నిర్వహించుటకు ఏడాది కాలానికి ఈ వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. టెంకాయలు వేలానికి రూ.1లక్ష, పూలు, పటముల అంగళ్లకు రూ.10వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు.

కొత్తూరులో ప్రవచనాలు



బాల బ్రహ్మానంద సరస్వతిని సన్మానిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి దివ్యతత్వంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. నైమీశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతీచే ప్రవచనాలు వినిపించారు. స్వామి వారి విశిష్టతలు, స్వామి వారి జననం, జరిగే కైంకర్యాలు తదితర వాటిని వివరించారు. అనంతరం ఈఓ రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

కర్నూలు కల్చరల్: మాఘ మాసం మాఘ పూర్ణిమ, శివరాత్రి పండుగల ప్రత్యేకతలపై త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కర్నూలు, కల్లూరు కమిటీల ఆధ్వర్యంలో నగరంలోని పలు కాలనీల్లో ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంతం ప్రభోద సమితి ఇందూజ్ఞాన వేదిక కర్నూలు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు నాగయ్య, కల్యాణ్, హరి జగదీష్, మధువాణి, ప్రమీల, సుశీల, మెంకటేష్, దివ్య, చందన తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో కర్నూలుకు పతకాలు

కర్నూలు (టౌన్): ఈనెల 8 వ తేదీ నుంచి 11 వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో కర్నూలుకు రెండు పతకాలు లభించాయి. 55 సంవత్సరాలు వయస్సు దాటిన విభాగంలో 4 ×400 రిలే రేసులో పాల్గొన్న కర్నూలు డైట్ కళాశాల లెక్చరర్ వెంకటసుబ్బమ్మ వెండి పతకం, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకం సాధించారు. తమ కాలేజీ అధ్యాపకుడు జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం గర్వకారణమని ప్రిన్సిపాల్ వసుంధర దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- నెరవాడలో ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకు, సీసీ రోడ్డు ప్రారంభోత్సవం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో మేయర్ బీవై రామయ్య

కల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నెరవాడ గ్రామంలో సర్పంచ్ మదన్‌గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.30.80లక్షలతో నూతనంగా నిర్మించిన ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకు, ఇంటింటికీ కుళాయి, ఎస్సీ కాలనీలో రూ.5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు ఎంపీపీ బోయ శారద, కర్నూలు నగరపాల సంస్థ డిప్యూటీ మేయర్ రేణుక ముఖ్య అతిథులుగా హాజరై అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి.. ప్రజల చెంతకే అన్ని సేవలు తీసుకువచ్చారని చెప్పారు. కులమతాలు, రాజకీయాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సిఫారసులతో పాటు నాయకుల అండదండలు ఉంటేనే ప్రభుత్వ పథకాలు అందేవని గర్తు చేశారు.

వక్కెర వాగుపై బ్రిడ్జి త్వరలో పూర్తి

వక్కెర వాగుపై సుమారు రూ.35లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు జయరాఘవేంద్రారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, టి.నరసింహులు, టి.శీను, గౌస్‌పీరా, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, ఎంపీడీఓ రమణమూర్తి, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

కల్లూరు అర్బన్ 19వ వార్డు రాంప్రియ నగర్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం రాంప్రియ నగర్ కాలనీలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నగర పాలక సంస్థ పాలక వర్గం ఏర్పడ్డాక కాలనీలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాబోయ్యే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చేలా కష్టపడి పని చేద్దామన్నారు. కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడు అండగా, తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, కల్లూరు అర్బన్ క్లస్టర్–1 అధ్యక్షుడు భీమాశంకర్‌రెడ్డి, 21వ వార్డు కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నెరవాడలో కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీదే అధికారం

ఓర్వకల్లు : రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు, పార్టీ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని పాలకొలను గ్రామంలో ఆదివారం సాయంత్రం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. గ్రామ నాయకులు రమేష్, వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నరసింహారెడ్డితో పాటు ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ఎన్ని పార్టీలు ఏకమైనా వైఎస్సార్‌సీపీని ఢీకొనే వారు లేరని తేల్చి చెప్పారు. చంద్రబాబు నాయుడి మోసపూరిత మాటలను ప్రజలు నమ్మే ప్రసక్తి లేదని, మరోసారి టీడీపీ కూటమిని ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటసుబ్బారెడ్డి, న్యామతుల్లా, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, కాల్వబుగ్గ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోగర్‌బాషా, జీకే వెంగన్న తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శివనరసింహారెడ్డి

సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

కోడుమూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారంతా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు సూచించారు. ఆదివారం కోడుమూరులో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను నియమించారని, పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాల్సి ఉందన్నారు. అయితే ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అనుచరులమని చెప్పుకుని తిరిగే కొందరు టీడీపీ వర్గీయులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డాక్టర్ సతీష్‌పై చౌకబారు విమర్శలు చేస్తున్నారని, వీరంతా గత ఎన్నికల్లో టీడీపీ జెండాలు మోయడంతో పాటు, వారితో కలిసి ప్రచారాలు కూడా చేశారన్నారు. పబ్బం గడుపుకునేందుకు ఎమ్మెల్యే పంచన చేరి ఉద్దేశపూర్వకంగా అసత్యారోపణలు చేస్తున్నారని, చౌకబారు విమర్శలు ఇప్పటికైనా మానుకోకపోతే ప్రజా వ్యతిరేకత చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, మాజీ గ్రామ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ స్వప్రయోజనాల కోసం వచ్చిన వ్యక్తులు అలాగే ఉంటే బాగుంటుందని, వైఎస్సార్‌సీపీ నిర్ణయాలకు వ్యతిరేకంగా మాట్లాడితే సహించమని హెచ్చరించారు. సమావేశంలో ఉపసర్పంచ్ మాదులు, మాజీ సర్పంచ్ ఈశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు డిష్ రవి, బోరెల్లి సోమన్న, రాఘవేంద్ర, లింగన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు



స్వామివారిని దర్శించుకుంటున్న ప్రముఖులు, భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకారంలో శ్రీవారు

కర్నూలు కల్చరల్: సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం 18వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, మహా నారాయణ హోమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, హైకోర్టు మాజీ జస్టిస్ భవాని ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్, తెలంగాణ మాజీ ఎన్నికల అధికారి నాగిరెడ్డి, విశ్రాంత జిల్లా కలెక్టర్ రాంశంకర్ నాయక్, గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ కల్కూర, రిటైర్డ్ పోస్టల్ సూపరింటెండెంట్ కేవీ సుబ్బారావు పూజల్లో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీవారు గజ వాహనంపై పుర వీధుల్లో మంగళ వాయిద్యాల కోలాటాల మధ్యలో భక్తులకు దర్శనమిచ్చారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్ శర్మ, కార్యదర్శి హెచ్‌కె రాజశేఖర్ రావు, రాష్ట్ర కోశాధికారి హెచ్‌కే మనోహర్‌రావు, సంఘం సభ్యులు మాధవ ప్రభు, కేజీ ప్రభాకర్‌రావు, దుర్గాప్రసాద్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటాలు

కర్నూలు (సిటీ) : ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ అలుపెరగని పోరాటాలు చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. యూటీఎఫ్‌ను స్థాపించి 50 ఏళ్ల అయిన సందర్భంగా ఆదివారం నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. సంఘం పతాకాన్ని రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వరు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం సాధించే విడతల వారీగా ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మాజీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నరసింహులు, యూటీఎఫ్ సంఘం తొలి జిల్లా ప్రధాన కార్యదర్శి, రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, ఆ సంఘం సభ్యులు ప్రసంగించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, రాష్ట్ర నాయకులు నాగమణి, యల్లప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

పురుగుమందుల పిచికారీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతకుమారి

కర్నూలు(అగ్రికల్చర్): పురుగు మందులను పిచికారీ చేయడంపై అవగాహన పెంచుకోవాలని కలికిరి ఉద్యాన కళాశాల అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ శాంత కుమారి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమ కోర్సుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అసిస్టెంటు ప్రొఫెసర్ పాల్గొని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పురుగు మందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల విష ప్రభావానికి గురై అనేక మంది రైతులు మరణిస్తున్నారన్నారు. గాలికి ఎదురుగా నిలబడి పిచికారీ చేయరాదన్నారు. ఉదయం, సాయంత్రం వేలల్లోనే మందు పిచికారీ చేయాలని పేర్కొన్నారు. పురుగుమందులను ఎక్కడబడితే అక్కడ నిల్వ చేయరాదని, పిల్లలకు, మహిళలకు అందుబాటులో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ... పంటల్లో వివిధ తెగుళ్ల లక్షణాలు, సూక్ష్మ పోషకాల లోపాల నివారణ తదితర వాటి గురించి వివరించారు. రైతులకు చక్కటి సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం మీదే

- జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డా.ఎ.సునీల్‌కన్నా



విద్యార్థినులతో మైనార్టీ సంక్షేమాధికారి

కర్నూలు(అర్బన్): పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ఉంటే విజయం మన సొంతమవుతుందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డా.ఎ.సునీల్‌కన్నా అన్నారు. ఆదివారం ఆయన స్థానిక గడియారం ఆసుపత్రి సమీపంలోని మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ఎలా సంసిద్ధులు కావాలనే అంశంపై వివరించారు. అలాగే పదవ తరగతి అనంతరం ఇంటర్, డిగ్రీలో తీసుకోవాల్సిన గ్రూపులు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ దిశగా కష్టపడి చదవాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థినులకు ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్ తదితర మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారిణి బీ పుష్పాంజలి, కార్యాలయ సీనియర్ సహాయకులు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీ పార్లర్ శిక్షణతో స్వయం ఉపాధి

కర్నూలు (టౌన్): బ్యూటీ పార్లర్‌లో శిక్షణతో స్వయం ఉపాధి పొందవచ్చునని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నాగ శివలీల అన్నారు. ఆదివారం స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని అనూస్ బ్యూటీ పార్లర్‌లో అనూస్ బ్యూటీ శిక్షణ కేంద్రం, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ మాట్లాడుతూ అందంగా కనిపించడం ఆత్మవిశ్వాసానికి ప్రతీక అన్నారు. నేటి ఆధునిక సమాజంలో బ్యూటీకి ఎంతో ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఇటువంటి రంగాలను నిరుద్యోగ మహిళలు ఉపాధిగా ఎంచుకోవాలన్నారు. దేశంలోనే పేరు గాంచిన అనూస్ సంస్థ ద్వారా ఉచితంగా 10 రోజుల పాటు శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఎంఎం మురళీ, టీఎంసీ భారతి, సీఓలు పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యల పరిష్కారం

గడివేముల: దూదేకుల/నూర్ బాషా కులస్తులందరూ ఐక్యతగా ఉంటే సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు వాసవి దస్తగిరి, ప్రధాన కార్యదర్శి గోల్డ్ దస్తగిరి, కోశాధికారి ఉసేనప్ప, జిల్లా యూత్ అధ్యక్షుడు గబ్బర్ దస్తగిరి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన గడివేముల కొత్త బస్టాండ్ సమీపంలోని దూదేకుల సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల కమిటీ ఎన్నిక జరిగింది. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షలకు పైగా దూదేకుల జనాభా ఉందని, దామాషా ప్రకారం చట్టసభల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. మైనార్టీ పదవులలో వర్గీకరణ, దామాషా ప్రకారం దూదేకులకు పదవులతో పాటు బడ్జెట్ కేటాయించాలన్నారు. ఏ రాజకీయ పార్టీ అయితే నూర్ బాషా కులస్తులకు చట్టసభలలో అవకాశం కల్పిస్తుందో ఆ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలియజేశారు. అనంతరం గడివేముల మండల దూదేకుల/నూర్ బాషా అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ చిన్న జమాల్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా డాలుస్వామి, సెక్రటరీగా తిరుపాడు దర్గస్వామి, ట్రెజరర్‌గా మహబూబ్ బాషాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎక్స్‌ఆర్మీ జమాల్ బాషా, టీచర్ మహబూబ్ బాషా, రైస్‌మిల్ జమాల్ బాషా, రహీంబాషా, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఏర్పడిన మండల దూదేకుల కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

క్రిష్ణాపురం రోడ్డుకు మోక్షం!

- రూ.2.95 కోట్లతో రహదారి నిర్మాణం... చురుగ్గా సాగుతున్న పనులు
- ఇరవై ఏళ్లుగా రాకపోకలకు నరకయాతన
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీరనున్న సమస్య... సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



రోడ్డు వెడల్పు చేస్తున్న దృశ్యం,



రోడ్డు నిర్మాణానికి కంకర పరచిన దృశ్యం

కోడుమూరు రూరల్ : పట్టణాలు, మండల కేంద్రాలే కాదు... కుగ్రామాలకు సైతం మౌలిక వసతులు కల్పిస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరు నుంచి క్రిష్ణాపురం గ్రామానికి వెళ్లే 5కిలో మీటర్ల రోడ్డు మార్గం గుంతలమయంగా మారి ప్రయాణాలు చేయలేని విధంగా తయారైంది. రాకపోకలకు నరకయాతన అనుభించాలరు ఆయా గ్రామాల ప్రజలు. వర్షాకాలం ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ రోడ్డు క్రిష్ణాపురం గ్రామంతోపాటు క్రిష్ణగిరి మండలంలోని పోతుగల్లు, సంగాల, ఆగవేళి, గుండ్లమల్లాపురం, చుంచెర్రగుడి వంటి గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి. రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ఐదు కిలోమీటర్లు ప్రయాణించేందుకు సుమారు 40నిమిషాల వరకు సమయం పట్టేది. రోడ్డు బాగు చేయాలని గత టీడీపీ ప్రభుత్వ హయంలో పలుమార్లు గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధులతో మొరపెట్టుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. అదిగో.. ఇదిగో అంటూ ఐదేళ్ల పాలనను టీడీపీ ప్రభుత్వం పూర్తి చేసిందే తప్ప క్రిష్ణాపురం గ్రామానికి మాత్రం రోడ్డు వేసింది లేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు రూ.2.95కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు నెలకింద చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిష్కరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి తాము ఎల్లవేళలా రుణపడి ఉంటామని ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



మా ఊరికి ఏన్నో ఏళ్ల రోడ్డు సరిగాలేక నానా ఇబ్బందులు పడ్డాం. చాలామంది గ్రామస్తులు ఊరు సైతం వదిలి కోడుమూరు, కర్నూలులో నివాసముంటున్నారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి రూ.2.95కోట్లు మంజూరు చేయడంతో పాటు, నిర్మాణ పనులను కూడా వేగంగా చేపట్టడం సంతోషంగా ఉంది. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– విజయ్‌కుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు, క్రిష్ణాపురం

చాలా సంతోషంగా ఉంది



మా ఊరికి సరియైన రోడ్డు మార్గం లేక నిత్యం తీవ్ర ఇబ్బందులు పడే వాళ్లం. రోడ్డంతా గుంతలమయంగా మారి ఐదు కిలోమీటర్ల రోడ్డులో ఆరగంటకు పైగా ప్రయాణం పట్టేది. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మా ఊరికి రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణ పనులను కూడా వేగంగా నిర్వహిస్తుండడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రభుత్వ సాయం మరువం.

– చంద్రమౌళి, క్రిష్ణాపురం గ్రామం, కోడుమూరు మండలం

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రామాంజినేయులు తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీటీ పేర్కొన్నారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ అనుపమ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పందనకు గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ ఉదయ్‌సంతోష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు ఆదివారం 159 క్యూసెక్కులు విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.305 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

888 మంది ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్

కోడుమూరు రూరల్ : పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా మండలంలో ఇంటి స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చురుగ్గా సాగుతుంది. 2,045మంది లబ్ధిదారులకుగాను ఆదివారం వరకు 888మందికి సిబ్బంది ఇండ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేశారని కోడుమూరు డిప్యూటీ తహసీల్దార్ రామాంజినేయులు తెలిపారు. జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన ప్రతి లబ్ధిదారురాలికి ప్రభుత్వం ఉచితంగా స్థలాల రిజిస్ట్రేషన్ చేయిస్తుందని, ఆయా గ్రామాలలో సచివాలయాలకు వెళ్లి త్వరగా స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీటీ సూచించారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల, మోడల్ జూనియర్ కళాశాలల కేంద్రాలలో ఇంటర్ రెండవ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ఆదివారం ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. గురుకుల కళాశాలలో బాటనీ (వృక్షశాస్త్రం) ప్రాక్టికల్స్‌ను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు.

క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రమ శిక్షణతో క్రీడల్లో రాణించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక కిడ్స్ వరల్డ్‌లో సిలంబం మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మన దేశ ప్రాచీన క్రీడ సిలంబం అన్నారు. ఈ క్రీడను కర్నూలులో అభివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. విద్యార్థులు యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి శారీరక ఆరోగ్య క్రీడలను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): ఉల్లి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు వేసిన రైతులకు తీవ్ర నష్టాలు మిగిలాయిన్నారు. అయితే, ఇప్పుడు ఉల్లి పంటకు కూడా గిట్టుబాటు ధర లేదన్నారు.

సనాతన ధర్మాన్ని విస్తరిద్దాం

కర్నూలు కల్చరల్: విశ్వవ్యాప్తంగా సనాతన ధర్మాన్ని విస్తరింపజేద్దామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర అన్నారు. ఆదివారం నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ జాతి సంఘటితం కావాలన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు యాదవ్, అధికార ప్రతినిధి రామాంజనేయులు పాల్గొన్నారు.